క్లుప్తంగా

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న దళిత సంఘం నాయకులు

సారవకోట: ఎస్సీలంతా ఏకమై తమ హక్కుల సాధనకు కృషి చేయాలని ఎస్సీ నాయకులు తీర్మానం చేశారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ కమ్యూనిటీ హాల్‌లో మండల ఎస్సీలంతా ఆదివారం సమావేశమైయ్యారు. అందరూ ఐక్యంగా ఉంటూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. త్వరలో మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో పశువైద్య శాఖ ఏడీ లోకనాథం, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, మండల సంఘం అధ్యక్షుడు దాలయ్య, సింహాచలం, ఆనందరావు తదితరులున్నారు.

సంఘం పటిష్టతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కృష్ణ

నరసన్నపేట: స్థానిక శిష్టకరణ సంఘం అభివృద్ధి, పటిష్టతకు సభ్యులు అందరూ కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లోని శిష్టకరణ సంఘ భవనంలో సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా సంఘం పటిష్టతతో పాటు సంఘ భవనం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సభ్యత్వం రుసుం వసూళ్లకు, కార్తీక మాసంలో పికినిక్ నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అంప్లాం వసంతకుమార్, కోశాధికారి ఎంవీజే మోహనరావుతో పాటు సభ్యులు ఎస్.ప్రభాకరరావు, బుజ్జి, ఎస్.సింహాచలం, చౌదరి, రవి, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములుకండి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రభుత్వం తరఫున నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో జనసేన కార్యకర్తలు, నాయకులు భాగస్వాములు కావాలని ఆ పార్టీ నరసన్నపేట ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రధాన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలు కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత మాకువ



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో రావాడ రమణ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మాకువ జట్టు విజేతగా నిల్చింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలలో కుమ్మరిగుంట, మాకువ జట్లు తలపడగా మాకువ టీం టోర్నీని కైవసం చేసుకుంది. వీరికి చిన్నాల వెంకట సత్యన్నారాయణ, లక్ష్మీనారాయణ నాయుడు, బల్ల రాంబాబులు బహుమతులు అందజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కొత్తూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: వర్షా కాలం ఆరంభమైన నేపథ్యంలో అంటు రోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వారం పాటు పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించాలని పంచాయతీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగా కొత్తూరు మండలంలోని 43 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 19 తేదీ నుంచి ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. వీధుల్లో చెత్తను, కాలువల్లో పూడికలను తొలగిస్తున్నారు. ఆయా పంచాయతీ సర్పంచ్‌లు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 25 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతామని ఎంపీడీవో త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావులు తెలిపారు.

భయపెడుతున్న మలుపులు!



ప్రమాదాలకు కారణమవుతున్న తూముకొండ రామచంద్రాపురం మలుపు ఇదే

- తూముకొండ రామచంద్రాపురం మలుపులో తరచూ ప్రమాదాలు
- ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు

మెళియాపుట్టి: చాలా ప్రాంతాల్లో ఉన్న రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద ప్రమాద నివారణ చర్యలు తీసుకోవడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మెళియాపుట్టి మండల కేంద్రం నుంచి పలాస వెళే ప్రధాన రహదారిలో నిత్యం అత్యధికంగా వాహనాలతో ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. అయితే తూముకొండ రామచంద్రాపురం (ఆకులమ్మ తల్లి ఆలయం) మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఆ ప్రదేశంలో ఏదోఒక రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. సుమారు కిలోమీటరు రహదారి మలుపుతో పాటు ఎత్తైన ప్రదేశం నుంచి ఒక్కసారిగా వాహనాలు కిందికి రావాల్సి ఉంటుంది. అటువంటి సమయాలలో అనేక వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. ఇక్కడ తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో చాలామంది గాయపడడం, మరికొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు.. గత రెండు నెలల్లో 12 ప్రమాదాలు ఈ మలుపువద్ద చోటుచేసుకున్నాయి. ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. కాలు చేతులు విరిగి, తీవ్రగాయాలతో చాలామంది ఆస్పత్రి పాలయ్యారు. పలాస రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఇదే ప్రధానరోడ్డు కావడంతో ఎంతోమంది కుటుంబాలతో ఆటోలలో, బస్సులలో ప్రయాణిస్తుంటారు. అంతేకాకుండా మలుపు ప్రదేశంలో పేరుగాంచిన ఆకులమ్మవారి గుడి ఉండటంతో ఆది, మంగళ వారాలల్లో మొక్కులు చెల్లించేందుకు వెళ్తుంటారు. రహదారి పక్కనే వనభోజనాలు చేస్తుంటారు. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద సూచికలు ఉన్నా ప్రయోజనం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. సంబంధిత శాఖా అధికారులు ఈ మలుపుపై ప్రత్యేక దృష్టిసారించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.



మలుపులో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన టెన్త్ విద్యార్థి (ఫైల్)

భయంతోనే ప్రయాణం



మాది తూముకొండ రామచంద్రాపురం గ్రామానికి పక్కనే ఉన్న పెద్దమడి గ్రామం. ఏ చిన్న అవసరం వచ్చినా మలుపు దాటి మెళియాపుట్టి మండల కేంద్రానికి రావాల్సిందే. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటోంది. కొంతదూరం వరకూ అటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో కనబడని పరిస్థితి. రాత్రి వేళల్లో అయితే ప్రయాణం చాలా కష్టం. నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. అధికారులు స్పందించి రహదారి పక్కన ఉండే పిచ్చిమొక్కలు తొలగించాలి. వేగ నియంత్రణనలు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.

–చంద్రశేఖర్ పట్నాయక్, పెద్దమడి గ్రామం

విత్తన శుద్ధి శ్రేయస్కరం



బీజామృతంలో విత్తనశుద్ధి చేయిస్తున్న సిబ్బంది

కొత్తూరు: బీజామృతంతో అన్నిరకాల విత్తనాలను శుద్ధి చేయడం వలన పంటకు ఎంతో శ్రేయస్కరం అని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ మాష్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పారాపురంలో సర్పంచ్, రైతు కుంచాల రత్నాలు ఆధ్వర్యంలో రైతులతో సామూహికంగా రైతులతో వరి విత్తనాలకు బీజామృతంతో శుద్ధి చేసే ప్రక్రియను ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వలన పంటకు ఎటువంటి తెగుళ్లు ఆశించవన్నారు. పురుగులు ఆశించక పోవడంతో ఆరోగ్యవంతమైన పంట పండుతుందన్నారు. రైతులంతా బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధి చేయాలని కోరారు. బీజామృతం వలన కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది భూదేవి, రమణమ్మ, బాలకృష్ణ, సుభాషిణి ఉన్నారు.

పాతపట్నంలో ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విజయోత్సవ బైక్ ర్యాలీని నిర్వహించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా గోవిందరావు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారిగా పాతపట్నానికి ఆదివారం సాయంత్రం తొలిసారిగా వచ్చారు. దీంతో నవతల నుంచి బైక్ ర్యాలీతో సీది కూడలి మీదుగా కొరసవాడ, కాగువాడ, బూరగాం, పాతపట్నం చేరుకున్నారు. నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసుకుని ఆలయం నుంచి ఎమ్మెల్యే నడుచుకుంటూ ర్యాలీగా ఆస్పత్రి కూడలి, మార్కెట్ మీదుగా ఆల్‌ఆంధ్రరోడ్డు, దువ్వారివీధి, అంతరాబ కూడలి వరకు టీడీపీ నాయకులు ఎమ్మెల్యేతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనను గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని చెప్పారు. ర్యాలీలో టీడీపీ నాయకులు తూలుగు తిరుపతిరావు, తులసీవరప్రసాద్, పైల బాబ్జి, సైలాడ సతీష్, శివ్వాల తేజేశ్వరరావు, అనపాన రాజశేఖర్ రెడ్డి, వెలమల గోవిందరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



గోవిందరావును సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే గోవిందరావుకు సత్కారం

ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా ఎల్.ఎన్.పేట మండల టీడీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. బొత్తాడసింగి మాజీ సర్పంచ్ అంపిలి సీతమ్మ, మండల టీడీపీ నాయకులు అంపిలి పోలినాయుడు పాల్గొన్నారు.

దైవ చింతన పెరగాలి



మాట్లాడుతున్న నిత్యానంద స్వామి

సారవకోట: ప్రజలలో దైవ చింతన పెరగాలని నర్సిపురానికి చెందిన వామన ఆశ్రమ పీఠాధిపతి నిత్యానంద స్వామి సూచించారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలలో ఆధ్యాత్మిక చింతన పెరగడం ద్వారా ఈర్షా ద్వేషాలు తగ్గుతాయని, సమాజాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని, మన సంస్కృతి సంప్రదాయాలను అనుసరించాలన్నారు. ప్రపంచ దేశాలు మన ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తుండంగా.. మనం మాత్రంగ ప్రాశ్చత్య సంస్కృతికి అలవాటు పడుతున్నామన్నారు. ఆయనతో పాటు నరసింహ స్వామి, అల్లు రామయ్య, శ్రీరామదాసు తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మెండ సన్యాసిరావు, పి.సోమేశ్వరరావులు పాల్గొన్నారు. మెండ సన్యాసిరావు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

ఎంపీటీసీ సభ్యుని కుటుంబానికి ధర్మాన సోదరుల పరామర్శ



పరామర్శలో ధర్మాన సోదరులు

సారవకోట: మండలంలోని బద్రి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావు నాయుడు కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే కృష్ణదాస్ సోదరులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఎంపీటీసీ సభ్యుడు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బాలచంద్రరావు నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకులు వరుదు వంశీకృష్ణ, సక్కు తులసీదాస్, పల్లి కృష్ణారావు, కనుసు సీతారాం, ముద్దాడ బైరాగినాయుడు, నిక్కు కృష్ణారావు, బోర శ్రీరామమూర్తి, మెండ సూర్యానారాయణ ఉన్నారు.

కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడికి సత్కారం



గోవిందరాజులను సత్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: కళింగ వైశ్య సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన బోయిన గోవిందరాజులకు నరసన్నపేట కళింగవైశ్య సంఘం తరపున ఆదివారం సత్కరించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు, స్థానిక వైశ్య సంఘం ప్రతినిధి జామి వెంకటరావు, కోరాడ రామచంద్రరావు, మురళి పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



పగలే వెలుగుతున్న వీధి దీపాలు

సారవకోట: మండలంలోని కేశవలస పంచాయతీ కేంద్రంలో వీధి దీపాలు పట్ట పగలే వెలుగుతున్నాయి. దీనిపై పంచాయితీ, సచివాల సిబ్బంది పర్యవేక్షణ లేక పోవడంతో నిత్యం ఇదే విధంగా పగలు వెలుగుతున్నాయని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. కరెంటు వృథా అవుతోందని చెబుతున్నారు. పంచాయతీ సిబ్బంది చర్య తీసుకొని పగటిపూట వీధి దీపాలు వెలకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు ఘన స్వాగతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యేగా కూన రవికుమార్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారణ చేసిన తరువాత తొలిసారిగా నియోజకవర్గ కేంద్రానికి ఆదివారం రాత్రి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత ఆమదాలవలస పట్టణ శివార్లలోని ఎన్టీఆర్ జంక్షన్ వద్దకు చేరుకున్న ఆయన దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అభివారం చేశారు. బాణసంచా కాలుస్తూ ర్యాలీగా పట్టణ శివార్లలోని కృష్ణాపురం జంక్షన్‌కు రాత్రి 9.30 గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 35 వేల భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు, బీజేపీ ఇన్‌చార్జి పేడాడ సూరపు నాయుడు, టీడీపీ ముఖ్య నాయకులు ఆనెపు రామకృష్ణ, సనపల డిల్లేశ్వరరావు, తమ్మినేని విద్యాసాగర్, తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తూ..

బూర్జ: మండల కేంద్రం బూర్జలో పాడైన విద్యుత్ వీధి దీపాలు స్థానంలో కొత్తవి అమర్చి వెలుగులు నింపారు స్థానిక అధికారులు. పంచాయతీ కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ ఏగు అనురాధ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ఈ పనులు ఆదివారం జరిగాయి. అలాగే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకును బ్లీచింగ్‌తో శుభ్రం చేయించారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పాతపట్నం: పాతపట్నం డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరు నుంచి తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 26వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న ఈ నెల 29వ తేదీన ఉదయం పది నుంచి 11 గంటల వరకు గురుకుల పాఠశాలలోనే అంగ్ల మాధ్యమంలో ప్రతిభ పరీక్ష ఉంటుందన్నారు.

మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళలో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్

కొత్తూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో త్రివిక్రమరావు ఆదివారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌కు మండల స్థాయి అధికారులంతా హాజరవుతారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎగువ ఎత్తిపోతల వల్లే.. సాగునీటి సమస్య

- టెక్కలిలో అచ్చెన్న నిర్వాకమే కారణం
- పలాస రైతులకు అందని సాగునీరు
- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉంగ ప్రవీణ

పలాస: వంశధార ఎడమ కాలువ ద్వారా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు సాగునీరు అందకపోవడానికి ఎగువన ఉన్న ఎత్తిపోతల పథకాలే కారణమని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలి మండలంలో మంత్రి అచ్చెన్నాయుడు సుమారు 23 చోట్ల ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయించడంతో దిగువకు నీరు రావడం లేదని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ కూడా ఇదే విషయమై మాట్లాడుతూ ఈ ఏడాదైనా నీరు తీసుకు వస్తే తమ ప్రాంత రైతులకు చాలా సంతోషమన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రవీణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ అతిథిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు.

వాడీవేడి చర్చ..

వ్యవసాయ, సాగునీటి పారుదల అంశాలపై వాడివేడీగా చర్చ జరిగింది. గత ఐదేళ్ల ఎందుకు వంశధార నీరు రాలేదని, గత ప్రభుత్వానికి, ముఖ్యంగా స్థానిక మంత్రికి దానిపై తగిన చిత్త శుద్ధి లేకపోవడమేనని, గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నీరు వచ్చింది కదా అని ఎమ్మెల్యే శిరీషా చెబుతుండగా మండల సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితునిగా వచ్చిన ఉంగ సాయికృష్ణ గట్టిగానే సమాధానమిచ్చారు. తాను వంశధార ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా గతంలో ఉన్నానని, మీ తండ్రి హయాంలోనే అచ్చెన్నాయుడు టెక్కలిలో ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారని గుర్తు చేశారు. దాని ఫలితంగానే నేడు తమ ప్రాంత రైతులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని అతనితో పాటు సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని చినంచల, కేదారిపురం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు లేవని, ఈ ఏడాది వాటిని మంజూరు చేయాలని సభ్యులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ సహకరిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మెట్ట వైకుంఠరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సవర చంద్రమ్మ, తలగాన శ్రీరాములు, వంశధార ఏఈ ప్రేమకుమార్, వ్యవసాయాధికారి పోలారావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచులు మద్దిల పాపారావు, దుర్యోధనరావు, కొర్ల శిరీష, తామాడ మదన్, సైని దేశయ్య, సాౠ తిరుపతిరావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నడుద్దాం.. రోగాలను జయిద్దాం

- మారుతున్న జీవనశైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ



కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద వాకర్ల సందడి

శ్రీకాకుళం రూరల్: మారుతున్న జీవన శైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఉదయం, సాయంత్రం వెళల్లో నడకొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పట్టణవాసులు నడకను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారు. సూర్యోదయానికి ముందే మైదానాలు, పార్కులు పట్టణ శివారు ప్రాంతాల్లో కనీసం నాలుగైదు గంటలు నడక సాగిస్తున్నారు. మరికొంతమంది ఇంట్లోనే ట్రెడ్‌మిల్‌తో వాకింగ్, ఇతర వ్యాయామాలు చేస్తున్నారు.

మానసికోల్లాసం..

శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో ఆర్ట్స్ కళాశాల, కోడిరామ్మూర్తి క్రీడామైదానం, విజయాదిత్య పార్కుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లోను, అదే విధంగా ట్రాఫిక్ తక్కువగా ఉన్నపుడు సింహ ద్వారం, 80 అడుగుల రోడ్డు వెంబడి మరికొంత మంది నడకను సాగిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులతో సహా అన్ని వయసులు వారు వాకింగ్‌తో పాటు చిన్నచిన్న వ్యాయామాలు చేసుకుంటున్నారు. గతం కన్నా ఇప్పుడు వాకింగ్ చేసిన వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, కలుగుతోందని, ఆలోచనా సామర్థ్యం సైతం మెరుగవుతుందని వైద్యులు చెబుతున్నారు.

అధిక బరువుకు చెక్..

ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా జనాభాలో అధిక శాతం ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేక్‌లు, పిజ్జాలు, బర్గర్లు, చాట్స్ వంటి జంక్ ఫుడ్స్‌ను అధికంగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. అధిక బరువుతో బాధపడే వారు ప్రతి నిత్యం వాకింగ్ ట్రాక్, యోగా కేంద్రాలు, జిమ్ వంటి ప్రాంతాల్లో వ్యాయామంతో పాటు పరుగులు తీస్తే మంచి ఆరోగ్యం సొంతమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బహుళ ప్రయోజనాలు..

ప్రతిరోజు నడక కొనసాగిస్తే బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలెస్ట్రాల్, కీళ్ల మోకాలా నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత, మంచి ఆలోచనాశక్తి పెరుగుతుంది.

షుగర్ నియంత్రణ..



నిత్యం గంటసేపు నడుస్తాను. 20 సంవత్సరాలుగా వాకింగ్ అలవాటు ఉంది. షుగర్ నియంత్రణలోనే ఉంది. పని ఒత్తిడి కారణంగా ఉదయం నడవకపోయినా సాయంత్రం పూట ఏదో సమయంలో వాకింగ్ చేస్తాను. దీంతో రోజంతా ఉల్లాసంగా ఉంటాను.

– ఆర్.చిన్నికృష్ణ, బైరివానిపేట

రెగ్యులర్‌గా..



ప్రతీ ఒక్కరూ రెగ్యులర్‌గా నడిస్తే ఆర్యోగంగా ఉంటారు. శరీర బరువుతో పాటు కొలెస్టాల్, బీపీ, షుగర్, నియంత్రణలో ఉంటుంది. గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువ. రోజు కనీసం అరగంట నడిస్తే మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది.

– డాక్టర్ ఐ.కె.విజయ్, కార్డియాలజిస్ట్, జెమ్స్ ఆసుపత్రి